అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



పరిటాలలో ఓ మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల : ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే సీఎం ఆశయమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని పరిటాల గ్రామ సచివాలయం-1 పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలకరించడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పాదయాత్రతోపాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ, దేశ చరిత్రలోనే ప్రజలకిచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చిన ఏకైక సీఎం జగన్ అన్నారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత మన ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఉన్నత కులాల్లోని నిరుపేదలకు ఆర్థిక సాయం అందించడం, అర్హతగల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయటంతో పాటు ప్రతినెల ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, ఎంపీటీసీ సభ్యులు కర్ల రాధిక, మండల సమాఖ్య అధ్యక్షురాలు కంచర్ల పద్మావతి, నాయకులు మార్త శ్రీనివాసరావు, జాన్‌బాబు, యద్దనపూడి విజయారావు, కర్ల రామకృష్ణ, జిక్కుల నరసింహారావు, జమలయ్య, ఏసుబాబు, తహసీల్దార్ వి. రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులపై గురుతర బాధ్యత

- ఆర్ఎస్ గార్డెన్స్‌లో మండల గృహ సారథుల సమావేశం
- దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే జగన్ మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్



గృహ సారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: గృహ సారథులే ప్రతిపాదిత కుటుంబాలకు సంక్షేమ సారథులని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. స్థానిక ఆర్ఎస్ గార్డెన్స్‌లో బుధవారం రాత్రి మండలంలో ఆయా గ్రామాలకు నియమితులైన గృహ సారథులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు, అరుణకుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గృహ సారథుల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ముఖ్యంగా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా గృహ సారథులు పని చేయాలని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో కూడా లేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి సమర్థంగా అమలు చేస్తున్నారని జగన్‌మోహనరావు, అరుణకుమార్ చెప్పారు. కరోనా కష్టకాలంలో సైతం వెన్ను చూపకుండా ప్రభుత్వ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. గృహ సారథులు వారికి కేటాయించిన కుటుంబాలతో మమేకమై ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ ప్రజా మన్ననలు పొందేలా పని చేస్తుందని గృహ సారథులు కూడా చిత్తశుద్ధితో పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు.

బీసీ సామాజిక వర్గానికి మండల కన్వీనర్..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పదవిని బీసీ సామాజిక వర్గానికి ఇస్తున్నామని జగన్‌మోహనరావు, అరుణకుమార్ పేర్కొన్నారు. మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన బీసీ సామాజికవర్గ నేతను పార్టీ మండల కన్వీనర్‌గా నియమిస్తామన్నారు. దీనిపై పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన కూడా రానుందని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ పక్షపాతి అని బీసీ సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్ని రకాలుగా అండగా ఉండటంతో పాటు వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల సుందరమ్మ, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, జడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, నాయకులు దాసు, బొల్లినేని శ్రీనివాసరావు, పారుపల్లి హరిబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి



పూజలు నిర్వహిస్తున్న గోర్ భాయ్ సేవా సంఘ సభ్యులు

జగ్గయ్యపేట అర్బన్: సుగాలీల ఆరాధ్య దైవం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకలు పట్టణంలో బుధవారం స్థానిక గోర్ భాయ్ సేవ సంఘ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ్ అధ్యక్ష, కార్యదర్శులు లాహోరి బద్దునాయక్, లావుడియా చిట్టిబాబు, సంఘ్ సభ్యుల సమక్షంలో శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ భోగ్ బండార కార్యక్రమం జరిగింది. గోర్ భాయ్ సేవా సంఘ్ అధ్యక్ష, కార్యదర్శులు బద్దూనాయక్, చిట్టిబాబు మాట్లాడుతూ గోర్ భాయ్ సేవా సంఘం వారికి కమ్యూనిటీ స్థలం లేకపోవడం వలన తమ సంఘ కార్యక్రమాలు ప్రభుత్వ స్థలం అయిన మార్కెట్ యార్డులో నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను లంబాడీ సంఘ సభ్యులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం ఇప్పిస్తే, ఆ స్థలంలో కమ్యూనిటీ భవనాన్ని నిర్మించుకుంటామన్నారు. శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి, హోలీ పండుగతో పాటు చిన్న చిన్న సభలు, సమావేశాలు, పంక్షన్లు జరుపుకుంటామని తెలిపారు.

పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రజలు సహకరించాలి



వార్డు పర్యటనలో భాగంగా పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ డాక్టర్ జయరాం

నందిగామ: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణంలోని 10వ వార్డులో బుధవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా డ్రైయిన్లలో పూడిక తీతలు, పిచ్చి మొక్కల తొలగింపు, బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ తదితర కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు కూడా సహకరిస్తే పట్టణాన్ని స్వచ్ఛ నందిగామగా తీర్చిదిద్దవచ్చన్నారు.

నైపుణ్యాలున్న వారికి ఉపాధి అవకాశాలు

సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాఘవేంద్రరావు



మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాఘవేంద్రరావు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నైపుణ్యాలు ఉన్న వారికి ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని, అందువల్ల యువత నైపుణ్యాల పెంచుకోవడంపై దృష్టి సారించాలని స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్శిటీ) సీనియర్ ప్రొఫెసర్ సీ.రాఘవేంద్రరావు చెప్పారు. సిద్ధార్థ కళాశాల వెబ్‌నార్ హాలులో పీజీ (ఎమ్మెస్సీ), ఎంసీఏ, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ప్రస్తుత ప్రపంచంలో సమస్యలు-గణితం ద్వారా పరిష్కారమార్గాలు అనే అంశంపై బుధవారం సదస్సు జరిగింది. రాఘవేంద్రరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు రావడం లేదని, నిరుద్యోగం క్రమంగా పెరుగుతోందని అనడంలో వాస్తవం లేదన్నారు. యువత చదువుతో పాటుగా నైపుణ్యాలు పెంచుకోవాలని, అప్పుడే ఉద్యోగాలు వెతుక్కుంటూ వస్తాయని చెప్పారు. నైపుణ్యాలు లేకుంటే ఏ కంపెనీ ఉద్యోగాలు ఇవ్వవనే విషయాన్ని యువత గుర్తించుకోవాలన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటన్నింటికీ సాంకేతికత పరిష్కార మార్గాలు చూపలేవని రాఘవేంద్రరావు చెప్పారు. నిత్యం జీవితంలో ఎదురయ్యే సమస్యలను గణిత శాస్త్రం ఉపయోగించి వాటిని ఎలా పరిష్కరించుకోవాలో ఆయన తెలియజేశారు. కళాశాల డీన్ రాజేష్ సీ.జంపాల మాట్లాడుతూ విద్యార్థులు అంశాలను ఇష్టపడి చదవడం ద్వారా దానిపై పట్టు సాధించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ సమాజంలో ఎదుర్కొంటున్న పలు సమస్య పరిష్కారానికి పరిశోధనలు ఎక్కువగా జరగాలన్నారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్.రవికిరణ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు ఇలాంటి సదస్సులు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు.

ఆదర్శ పాఠశాలను పరిశీలించిన జేడీ

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ ఆదర్శ పాఠశాలను, కళాశాలను ఎన్టీఆర్ జిల్లా మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ ఎం.వెంకటకృష్ణారెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలో ఉన్న అత్యాధునిక అటల్ టింకరిక్ ల్యాబ్, ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లను పరిశీలించి తగు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులతో మమేకమై వారు చదువుతున్న విధానాన్ని పరిశీలించి, వారు ఉత్తీర్ణత సాధించేలా మెలకువలను సూచించారు. ఉపాధ్యాయులతో చర్చించి పాఠశాల నైపుణ్యం అభివృద్ధికి అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో సీబీఎస్సీ ఇన్‌చార్జి శ్రీలత, ఏఎంఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలకు నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జగనన్న కాలనీల్లో సామూహిక గృహ ప్రవేశాలకు నిర్దేశించిన 16వేల ఇళ్ల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. లక్ష్య సాధనలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల ప్రగతిపై బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఢిల్లీరావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, స్పెషలాఫీసర్లు, తహసీల్దార్లు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో జగనన్న కాలనీల్లో ఉగాది నాటికి సుమారు 16 వేలకు పైగా ఇళ్లకు లబ్ధిదారులతో సామూహిక గృహప్రవేశాలు చేయించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 7,821కు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం వివిధ దశలలో ఉందన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి నిర్దేశిత సమయానికి గృహప్రవేశాలు చేయించాలన్నారు. ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులతో తక్షణమే ముఖాముఖి మాట్లాడి నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించి లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఉగాది నాటికి లక్ష్యాలు పూర్తి కావాలన్నారు. కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ శ్రీదేవి, డీఈ రవికాంత్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్, జిల్లాకు చెందిన మండల స్పెషలాఫీసర్లు, ఎంపీడీఓలు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు నిర్దిష్ట ప్రణాళిక అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శారదాదేవి

విజయవాడ స్పోర్ట్స్: ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్న యువతే జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధిస్తుందని యువజన సర్వీసుల శాఖ కమిషనర్, మేనేజింగ్ డైరెక్టర్ కె.శారదాదేవి అన్నారు. 9,10 తరగతుల విద్యార్థులు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్‌పై పటమటలోని యువజన సర్వీసుల శాఖ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం అవగాహన కల్పించారు. జీవితంలో అధిగమించాల్సిన లక్ష్యాలను ముందస్తుగానే నిర్ణయించుకోవాలన్నారు. ఆ లక్ష్యాలను చేరుకునేందుకు పాఠశాల స్థాయి నుంచే పునాదులు వేసుకోవాలన్నారు. లక్ష్యాలు చేరుకునే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు మానసికంగా ధైర్యంగా ఉండాలని సూచించారు. యువతకు కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులను త్వరలో నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు. అనంతరం మానసిక వైద్యులు డాక్టర్ జగదీష్, తేజావతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆ శాఖ డీడీ రామకృష్ణ, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల యువజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులతో ప్రభుత్వ విప్ ఉదయభాను, కళాశాల యాజమాన్యం

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం కష్టపడుతూ ముందుకు సాగాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీతారామపురంలోని కొత్త కల్యాణ మండపంలో జేఆర్సీ-విశ్వభారతి విద్యా సంస్థలకు చెందిన డిగ్రీ కళాశాల మెగా ఫెస్ట్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే ఉదయభాను ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఎంతో విలువైన బహుమతులు అందజేస్తూ విద్యను ప్రోత్సహిస్తున్న తీరు ఆదర్శనీయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కూడా విద్యారంగంలో సంస్కరణలు చేపట్టి సంచలనమైన, విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యనందించాలనే లక్ష్యంతో ఇంగ్లిషు మీడియంలో బోధన, ల్యాప్‌ట్యాబ్‌లు అందజేసి, విదేశీ విద్య, ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచాలని అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలతో పాటు నాడు-నేడు పథకం ద్వారా పాఠశాల రూపురేఖలనే మార్చివేశారని తెలిపారు. అనంతరం ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలను ఉదయభాను అందజేశారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు నంబూరి రవి, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, కౌన్సిలర్ తన్నీరు నాగమణి నాగేంద్ర, కళాశాల చైర్మన్ రంగాపురం నరసింహారావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పెనుగొండ రాజీవ్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

జగన్ పాలనపై భరోసాతోనే చేరికలు

వైఎస్సార్ సీపీ యువ నేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న యువనేత సామినేని వెంకట కృష్ణప్రసాద్

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ఉజ్వల భవిష్యత్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని, ఆ భరోసా తోనే పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక 9వ వార్డు చింతల తోపునకు చెందిన చింతల అబ్బులు, జ్యోతి, ఫణి, నాగసాయి తదితరులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ ప్రసాద్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను నియోజకవర్గ అభివృద్ధి కోసం పడుతున్న తపన, కృషి తమను ఎంతో ఆకర్షితులను చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దేశంలోనే అనేక రాష్ట్రాలు ఏపీ వైపు చూస్తున్నాయన్నారు. ఆయన పాలన మరొక 20 ఏళ్లు కొనసాగు తుందన్నారు. సీఎం వైఎస్ జగన్ మీద ఏర్పడిన నమ్మకంతోనే తాము వైఎస్సార్ సీపీలోకి చేరినట్లు తెలిపారు. స్థానిక నాయకులు స్టీల్ ప్లాంట్ సుబ్బారావు, మామిళ్లపల్లి శ్రీనివాసరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జెడ్పీ విద్యార్థిని



ఇందుతో ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు

నందిగామ(చందర్లపాడు): మండల పరిధిలోని కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శ్రీ గురురాజా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో త్రోబాల్ పోటీల్లో కొండపేట జెడ్పీ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని నర్రా ఇందు అత్యంత ప్రతిభను కనబరచడం ద్వారా జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యార్థిని ఇందుతోపాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు మేడేపల్లి స్ఫూర్తి, చావల శ్రీలక్ష్మి, కోట విజయకుమార్‌లను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చావల రవిబాబు, ఎస్ఎంసీ చైర్మన్ బి.ఏడుకొండలు, గ్రామ పెద్ద కందుల నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు బి.సీతారాం, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.రామారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనమందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు కీర్తి

వీరులపాడు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో రుచికరమైన ఆహారాన్ని అందించాలని జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య అన్నారు. మండలంలోని పొన్నవరం, జమ్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయాలన్నారు. అంతే కాకుండా ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనమందించాలని పథక నిర్వాహకులకు సూచించారు. అనంతరం రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షోడగిరి రాజశ్రీ పాల్గొన్నారు.

నేటి నుంచి వార్డు పర్యటన

కో ఆప్షన్ సభ్యురాలు బషీరున్నీసా



మాట్లాడుతున్న కోఆప్షన్ సభ్యురాలు బషీరున్నీసా, నాయకులు జుబేర్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 16వ తేదీ నుంచి సమస్యలు తెలుసుకునేందుకు 22వ వార్డులో పర్యటించనున్నట్లు మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు షేక్ బషీరున్నీసా తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆదేశాలతో కోఆప్షన్ సభ్యురాలు బషీరున్నీసా ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సచివాలయంలో వలంటీర్లు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వార్డులో ఉన్న పారిశుద్ధ్య, విద్యుత్ సమస్యలను గురించి అధికారులతో మాట్లాడి కొన్నింటిని పరిష్కరించారు. మిగిలిన సమస్యలను పరిష్కరించాల్సిందిగా అధికారులను కోరారు. 22వ వార్డులో ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని ఎమ్మెల్యే ఉదయభాను ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, పట్టణ యూత్ కమిటీ మాజీ అధ్యక్షుడు షేక్ జుబేర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక హోమాలు



నందిగామ: పట్టణంలోని మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో బుధవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామునే పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. ఆ తర్వాత లోక శాంతిని కాంక్షిస్తూ పలు రకాల హోమాది కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రారంభమైన కల్యాణోత్సవాలు

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో భవానీ ముక్తేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ సమీపంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న ముక్తేశ్వర స్వామి వారి ఆలయాన్ని అర్చకులు సంప్రోక్షణ నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని పెండ్లి కుమారునిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు సాంబశివరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో నాగరాజు, కేసీపీ సంస్థ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

నందిగామ: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌హెచ్‌ఓ సతీష్ తెలిపారు. పట్టణ సమీపంలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణలో భాగంగా బుధవారం రహదారి మరమ్మతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ఎస్ హెచ్ ఓ తెలిపారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా వాహన చోదకులు కూడా తగు జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు.

24 నుంచి స్పోర్ట్స్ మీట్



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 24, 25 తేదీల్లో ఆర్కే సీఈ స్పోర్ట్స్ ఫెస్ట్(అంతర్ కళాశాలల స్పోర్ట్స్) నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని స్పోర్ట్స్ మీట్ చేపడుతున్నామన్నారు. పురుషుల విభాగంలో వాలీబాల్, కబడ్డీ, మహిళల విభాగంలో టెన్నీకాయిట్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కళాశాల పీడీలు గోపాలరావు, కరుణాకర్, వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

బలివే శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

బలివే(ముసునూరు): బలివేలోని మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని కార్య నిర్వహణాధికారి తల్లాప్రగడ విశ్వేశ్వరరావు, సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, కమిటీ అధ్యక్షుడు నాగుల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్సవాల ప్రత్యేకాధికారి నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్ ప్రత్యేక పర్యవేక్షణలో ఏర్పాట్లు వేగంగా పూర్తి చేశామన్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలోనూ, ఉత్సవ ప్రాంగణంలోనూ బారికేడ్లు, లడ్డూ ప్రసాదాలు ఏర్పాట్లు సిద్ధం చేయించామని, పుణ్య స్నానాలకోసం జల్లు స్నానాలు, దుస్తుల మార్చుకునేందుకు తాత్కాలికి రూమ్స్‌ను ఏర్పాటు చేయించామన్నారు. ఎంపీడీఓ జి.రాణి, ఈఓపీఆర్డీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో బలివే రేవుకు నీరు తరలించామన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారులను సరి చేయించే పనులు చేపట్టగా, నూజివీడు ఆర్టీసీ డిపో యాజమాన్యం ప్రతీ 10 నిమిషాలకు బస్సు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు. ఉత్సవ ప్రాంగణంలో తినుబండారాల దుకాణాలతో పాటు, వినోదం కోసం జెయింట్‌వీల్, కొలంబస్, బ్రేక్‌డాన్స్ వంటివి ఏర్పాటు చేశారు.

ప్రతి భక్తుడు పుణ్యస్నానం ఆచరించడమే లక్ష్యం

ఇబ్రహీంపట్నం: మహా శివరాత్రి పండుగ పురస్కరించుకుని ప్రతి భక్తుడు పుణ్య స్నానం ఆచరించడమే లక్ష్యంగా పవిత్ర సంగమం వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. స్నానపు ఘాట్లలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పారిశుద్ధ్య కార్మికులతో మెట్లపై పేరుకుపోయిన నాచు తొలగించారు. సున్నం బ్లీచింగ్ పౌడర్ మిశ్రమాన్ని చల్లించారు. వివిధ ప్రాంతాల్లో టెంట్లు ఏర్పాట్లు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.